సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 26 । నవంబర్ । 2023


సభకు హాజరైన పార్టీశ్రేణులు, జనం

కాంగ్రెస్ గళం

'విజయభేరి సభ' విజయవంతం

- భారీగా హాజరైన జనం
- కిక్కిరిసిన సభా ప్రాంగణం
- బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన రేవంత్
- ఉత్సాహంలో పార్టీశ్రేణులు

ఆమనగల్లు: కాంగ్రెస్ విజయభేరి సభ సక్సెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆమనగల్లులో నిర్వహించిన సభకు, ఊహించిన దానికంటే రెట్టింపు స్థాయిలో వేలాదిగా జనం తరలిరావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సభకు రాని వారు సభను ప్రత్యక్షంగా చూసేందుకు జాతీయ రహదారితో పాటు, పట్టణంలోని పలు ప్రధాన కాలనీల్లో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. సభకు ముఖ్య అతిథులు రెండు గంటలు ఆలస్యంగా వచ్చినప్పటికీ జనం వారి రాక కోసం ఎదురు చూశారు. రేవంత్ రెడ్డి ప్రసంగించేందుకు లేవగానే కొంతమంది రేవంత్ సీఎం అంటూ పెద్ద పెట్టున నినదించారు. ప్రముఖ జానపద కళాకారుడు జంగారెడ్డి బృందం ఆలపించిన పాటలతో సభా ప్రాంగణం మార్మోగింది. మహిళలు, యువకులు కేరింతలు, నృత్యాలతో సందడి చేశారు. సభకు హాజరైన ఖర్గే, రేవంత్, వంశీలను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు.

ప్రజాధనాన్ని లూటీ చేసిన కేసీఆర్: రేవంత్

సీఎం కేసీఆర్ లక్షల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేశారు. అవినీతి పరుడైన ఆయనకు చర్లపల్లి జైలులో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టించి ఇస్తాం. సీఎం కేసీఆర్‌కు రెండు పెగ్గులు.. బుక్కెడు బువ్వ చాలు. అయినప్పటికీ లక్షల కోట్లు దోచుకున్నారు. పది వేల ఎకరాల భూమిని అక్రమించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ దిగమింగిన లక్షల కోట్లు కక్కిస్తాం. కల్వకుర్తి నుంచి కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి శంకర్, ఇబ్రహీంపట్నం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి.

కల్వకుర్తి అభివృద్ధే ధ్యేయం: కసిరెడ్డి

కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైంది. ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన నియోజకవర్గంలో సాగునీటి సమస్యను తీర్చలేదు.ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంలో, విద్యా, వైద్య వ్యవస్థను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుంది. పార్టీ అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలను పరిష్కరిస్తుంది.


మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పక్కన అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

పాల్గొన్న నాయకులు..

కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలాజీసింగ్, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్‌యాదవ్, అనిత, కమ్లి, ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్‌రెడ్డి, కేశవులు, జంగయ్య, యాట నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, రాములు, కృష్ణనాయక్, మాణయ్య, దశరథం పాల్గొన్నారు.

షాద్‌నగర్‌లో రేవంత్‌రెడ్డి సభ రద్దు

షాద్‌నగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయభేరి బహిరంగసభ రద్దయింది. సభకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకావాల్సి ఉండగా ఆయన ప్రయాణించే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రాలేకపోయారు.


సభలో కార్యకర్తల జోష్

కమలదళం



కాషాయమయమైన తుక్కుగూడ

- మోదీ నామస్మరణతో మార్మోగిన సభా ప్రాంగణం
- బీజేపీ విజయ సంకల్ప సభ సక్సెస్
- తరలివచ్చిన పార్టీశ్రేణులు
- జోష్ నింపిన ప్రధాని ప్రసంగం

తుక్కుగూడ/పహాడీషరీఫ్/మహేశ్వరం: కమలనాథులు కదం తొక్కారు. తుక్కుగూడ కాషాయమయమైంది. మోదీ నామస్మరణ మార్మోగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తుక్కుగూడ వేదికగా బీజేపీ నిర్వహించిన విజయసంకల్ప సభ విజయవంతమైంది. పార్టీ మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం అభ్యర్థులు అందెల శ్రీరాములు యాదవ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్ యాదవ్, నోముల దయానంద్ గౌడ్ తరఫున ప్రధాని ప్రచారం నిర్వహించారు. సాయంత్రం 4.20 గంటలకు హెలిప్యాడ్ ద్వారా ఆయన సభాస్థలికి చేరుకున్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. 30 నిమిషాల పాటు కొనసాగినమోదీ ప్రసంగంలో 'నా తెలంగాణ ప్రజలారా నమస్కారములు అంటూ.. పదే పదే నా కుటుంబ సభ్యులారా.. అంటూ ప్రసంగించారు. బీసీ వ్యక్తిని సీఎంను చేస్తున్నామని.. బీజేపీ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. మోదీ ప్రసంగం ఆద్యంతం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభ ముగిసిన అనంతరం కార్యకర్తలు తమ వాహనాల వద్దకు రావడానికి ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడ్డారు.



ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో కలిసి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో కిషన్‌రెడ్డి తదితరులు

తుక్కుగూడ నుంచి శ్రీనగర్ వరకు వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ పోలీసులు కలుగజేసుకొని క్లియర్ చేశారు. సభా వేదిక వద్ద, సభా ప్రాంగణం చుట్టూ పోలీసులు భారీ భద్రత కల్పించారు.

జిల్లాను దోచుకున్నారు:
కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ

కొండా వెంకట రంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేస్తే.. కేసీఆర్ వచ్చి దోచుకున్నారు. తెలంగాణ వస్తే జీవితాలు బాగుపడుతాయని భావించి బీఆర్ఎస్‌లో చేరాను. తీరా మనవాళ్లే మనల్ని మోసం చేశారు. మంచి వాళ్లను ముందర పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. అందుకే బీఆర్ఎస్ నుంచి బయటకి వచ్చాను. ప్రచారానికి వస్తే తరిమికొట్టాలి.

ఈ గడ్డపై పుట్టిన బిడ్డను

- అందెల శ్రీరాములు యాదవ్, మహేశ్వరం అభ్యర్థి

నేను ఈ గడ్డపై పుట్టిన బిడ్డను. మోదీతో వేదిక పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ధర్మం ఒకవైపు.. అధర్మం మరోవైపు పోటీ పడుతున్నాయి. ఈ గడ్డకు పట్టిన శని సబితారెడ్డి. ఎంఐఎంతో కలిసి ఎన్నికల్లో గెలిచేందుకు కుట్ర చేస్తున్నారు. ఎంఐఎం రజాకార్లను, సబితను తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ఇందుకు ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలి.

న్యూస్‌రీల్

నేడు కన్హాకు ప్రధాని మోదీ

నందిగామ: మండలంలోని కన్హా శాంతివనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన కేంద్రంలో హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ డీపటేల్‌తో కలిసి ధ్యానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు శ్రీరామచంద్ర షాజహాన్‌పూర్(బాబూజీ) 125వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన స్మారక ఫలకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు మోదీ ఇక్కడికి రానున్నారు. ఈ నేపథ్యంలో కన్హా వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. శాంతివనంలోనికి ఎవరినీ అనుమతించడం లేదు.

బీసీలకు రాజ్యాధికారం రావాలి

- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- తాండూరులో ఎన్నికల ప్రచారం


తాండూరు సభలో ప్రసంగిస్తున్న పవన్‌కళ్యాణ్

తాండూరు టౌన్: బీసీలకు రాజ్యాధికారం రావాలి.. ఆ సామాజిక వర్గం వ్యక్తి సీఎం కావడమే తమ చిరకాల వాంఛ అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద జనసేన, బీజేపీ తాండూరు అభ్యర్థి నేమూరి శంకర్ గౌడ్‌కు మద్దతుగా నిర్వహించిన సభకు హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే స్ఫూర్తిగా జనసేన పార్టీ తెలంగాణలో పుట్టిందన్నారు. అన్యాయం జరిగితే తిరగబడాలి, అవినీతి జరిగితే ఎదుర్కోవాలనే నినాదంతోనే పోరాటం చేస్తున్నామన్నారు. నాకు జన్మనిచ్చింది ఆంధ్రా అయితే, పునర్జన్మనిచ్చింది తెలంగాణ అన్నారు. పోరాట యోధుడు గద్దరన్న, మంద కృష్ణ మాదిగ, మగ్దుం మొయినొద్దీన్‌లు నాకు స్ఫూర్తి అన్నారు. సామాజిక తెలంగాణ, బీసీలకు రాజ్యాధికారం రావాలన్నదే నా కోరిక అన్నారు. ప్రధాని మోదీ తెలంగాణలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పడంతో మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. తాండూరు, నాగర్‌కర్నూల్ అభ్యర్థులు నేమూరి శంకర్ గౌడ్‌ను, లక్ష్మణ్ గౌడ్‌ను గెలిపించాలని కోరారు.

ఇద్దరిని బలిగొన్న అతివేగం

మొయినాబాద్: అతివేగంతో వెళ్తున్న తుఫాన్ వాహనం మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు మరొకరు అక్కడికక్కడే మృతిచెందగా వాహనంలోని ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని అజీజ్ నగర్ చౌరస్తా సమీపంలో శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ గ్రామానికి చెందిన చెట్టుకింది రమేశ్ (35) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బోయ లక్ష్మయ్య(65)తో పాటు మరో ఆరుగురు తుఫాన్ వాహనంలో శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు బయలుదేరారు. ఉదయం 7.30 గంటల సమయంలో అతివేగంగా ప్రయాణిస్తున్న వీరి వాహనం అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ రమేష్, లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. గాయపడిన వారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేగంగా దూసుకొచ్చి బోల్తా పడిన తుఫాన్ రోడ్డు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఐదడుగుల దూరంలో ఆగిపోయింది. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.


ప్రమాదానికి గురైన వాహనం

బీఆర్ఎస్ కండువాలు.. కరపత్రాలు

ప్రమాదానికి గురైన తుఫాన్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు వెళ్తున్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన అనంతరం వాహనంలో ఆ పార్టీ కండువాలు, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సంబంధించిన ఎన్నికల ప్రచార కరపత్రాలు కనిపించాయి. ఉదయం పూట కార్యకర్తలు నగరంలో ఉండే పార్టీ నాయకులను కలిసేందుకు వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు సమాచారం.


రమేష్ (ఫైల్)


బోయ లక్ష్మయ్య(ఫైల్)

దామర్‌చెడ్‌లో విషాదఛాయలు

బషీరాబాద్: అజీజ్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందడంతో వారి స్వగ్రామం దామర్‌చెడ్‌లో తీవ్ర విషాదం అలుముకుంది. ప్రమాదంలో గ్రామానికి చెందిన చెట్టుకింది రమేష్, బోయ లక్ష్మయ్య మృతిచెందగా జి.నర్సిరెడ్డి, రవికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు.



హస్తం.. డిజిటల్ ప్రచారాస్త్రం

కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్ తరఫున వినూత్నంగా ప్రచారం చేపట్టారు. యువకులు డిజిటల్ స్క్రీన్లను భుజానికి తగిలించుకుని కాంగ్రెస్ మేనిఫెస్టోలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో సాయంత్రం, రాత్రి వేళ జనసందోహం ఉన్న ప్రాంతాలకు వెళ్లి అందరికీ కనిపించేలా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు.

– కందుకూరు

దేశానికి ప్రమాదకరం బీజేపీ

- ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలి
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఇబ్రహీంపట్నం: మతోన్మాద బీజేపీ దేశానికి ప్రమాదకరమని, ఆపార్టీని ఈఎన్నికల్లో ఓడించాలని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో శనివారం మీడియాతో మాట్లాడారు. బీజేపీ పట్ల బీఆర్ఎస్ తన స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీని నిరోధించేందుకు ఇండియా కూటమిగా ఏర్పడితే అందులోని భాగస్వామ్య పార్టీలతో కాంగ్రెస్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌తోపాటు తెలంగాణలో ఇండియా కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశంలోనూ ఇదే వైఖరి కనబర్చిందని మండిపడ్డారు. రాష్ట్రంలో వామపక్షాలతో చివరి వరకు పొత్తు ఉంటుందని చెప్పి సీపీఎంను కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. దేశంలో ఏ పార్టీ గెలిచినా ప్రాంతీయ పార్టీలు కీలకపాత్ర పోషిస్తాయని సీఎం కేసీఆర్ అంటున్నారని.. అయితే కేంద్రంలో బీజేపీ కాని ఇండియా కూటమి గాని అధికారంలోకి వస్తే బీఆర్ఎస్ దేనికి మద్దతునిస్తుందో స్పష్టం చేయాలన్నారు. కేసీఆర్ వ్యవహారశైలి బీజేపీకి మద్దతిచ్చేలా ఉందన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య విధానాలను కాలరాస్తున్న మతోన్మాద బీజేపీ వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో సీపీఎం 19, ఒక్క స్థానంలో సీపీఐ, మరికొన్ని స్థానాలల్లో వామపక్ష శక్తులు పోటీ చేస్తున్నాయని.. ఆయా పార్టీలకు ఓట్లు వేసి గెలిపించాలని రాఘవులు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నేతలు జాన్‌వెస్లీ, భాస్కర్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

ప్రజల సొమ్ము కొల్లగొట్టారు

- నిధులన్నీ కేసీఆర్ కుటుంబానికే..
- అప్పుల రాష్ట్రంగా మార్చారు
- టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ తీన్మార్ మల్లన్న

కందుకూరు: కేసీఆర్ కుటుంబం తెలంగాణ ప్రజల సొమ్ము రూ.6 లక్షల కోట్లు కొల్లగొట్టిందని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్ఆర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల అభయ హస్తం వంటి పథకాల నిధులు రూ.13 కోట్లు కేసీఆర్ దోచుకున్నాడని.. భూలోకంలో ఆయన పెద్ద పాములాంటివాడని.. భూ భకాసురుడని ధ్వజమెత్తారు. కేసీఆర్ బిడ్డ సారా దందా చేస్తే మోదీ కాళ్లు పట్టుకుని విడిపించుకున్నాడన్నారు. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చినప్పుడు రాష్ట్రానికి మిగులు బడ్జెట్ అప్పగిస్తే, అప్పుల రాష్ట్రంగా మార్చారని దుయ్యబట్టారు. ఫార్మా పేరుతో రైతుల భూములను గుంజుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీని రద్దు చేసి ఎవరి భూములు వారికి అప్పగిస్తామన్నారు. మంత్రిగా ఉన్న సబితారెడ్డి ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఏం చేసిందని ప్రశ్నించారు. తెలంగాణ అంతటా కాంగ్రెస్ గాలి వీస్తోందని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేఎల్ఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. గడీలు, దొరల పాలనను గుర్తు చేసేలా ఎవరినీ కలవకుండా, ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌కే సీఎం కేసీఆర్ పరిమితమయ్యారని కేఎల్ఆర్ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు భూములు పంచితే, బీఆర్ఎస్ పాలనలో వాటిని బలవంతంగా లాక్కుంటున్నారని విమర్శించారు. తనను గెలిపిస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత నియోజకవర్గంలో తనదేనన్నారు. కాగా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, నాయకుడు మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ డి.జంగయ్య, నాయకులు మదన్‌పాల్‌రెడ్డి, జగదీష్, కృష్ణరాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న, పక్కన కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్ తదితరులు

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విజయం ఖాయం

బండ్లగూడ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించనున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలోని 7వ డివిజన్‌లో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి, కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తా

కాంగ్రెస్ రాజేంద్రనగర్ అభ్యర్థి నరేందర్ ముదిరాజ్

శంషాబాద్: తనను గెలిపిస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా మారుస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో గొల్లపల్లి, ఊటుపల్లి, రాళ్లగూడ, ఆర్బీనగర్, సిద్దంతి, కొత్వాల్‌గూడలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రాజేంద్రనగర్ నియోజవర్గానికి చేసిందేమిలేదని, కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధితోనే ఈ ప్రాంతానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుండడంతో స్థానికంగా కాంగ్రెస్‌ను గెలపించుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, సీనియర్ నాయకులు మైలారం సులోచన తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ ప్రచారం

అదనపు బలగాలను నియమించాలి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద అదనపు బలగాలను నియమించాలని కోరుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ శనివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం,రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలోని పోలింగ్ బూత్‌లు అతి సున్నితమైన ప్రాంతాలుగా ఉన్నాయని వివరించారు. ఈ పోలింగ్ బూత్‌లలో అదనపు పోలీసులను ఏర్పాటు చేయాలని కోరారు. పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసే ఏజెంట్ల పూర్తి వివరాలను సేకరించిన అనంతరమే అనుమతి ఇవ్వాలని కోరారు.

'పోస్టల్' కష్టాల్

బ్యాలెట్ అందక ఉద్యోగస్తుల ఆందోళన

- ఓటేయకుండా విధులకు హాజరవ్వమని అల్టిమేటం
- ఆందోళన అనంతరం అందించిన అధికారులు



పోస్టల్‌బ్యాలెట్‌ల కోసం ఆందోళన చేస్తున్న ఉద్యోగస్తులు

చేవెళ్ల: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిన ఎలక్షన్ కమిషన్ బ్యాలెట్ పేపర్లు అందించడంలో తాత్సారం చేసింది. దీంతో ఎన్నికల శిక్షణకు హాజరైన ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన శనివారం చేవెళ్ల ఎన్నికల రిట్నింగ్ కార్యాలయం పరిధిలోని శ్రీచైతన్య కళాశాల శిక్షణ కేంద్రం వద్ద చోటు చేసుకుంది.

300 మంది ఉద్యోగస్తుల లిస్ట్ ఆలస్యం

జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు చేవెళ్ల నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించారు. వారికి శనివారం శిక్షణ పూర్తైన వెంటనే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని ముందుగానే సమాచారం ఇచ్చారు. శిక్షణకు వచ్చిన వారికి మాత్రం పోస్టల్ బ్యాలెట్ పేపర్లు రాలేదు. ఇదే విషయమై చేవెళ్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని ప్రశ్నించగా.. మీ సొంత నియోజకవర్గాలనుంచి రావాలి.. అక్కడి నుంచి రాలేదు.. అక్కడే అడగండి సమాధానం ఇచ్చారన్నారు. నియోజకవర్గాల్లో అడిగితే ఎన్నికల విధులు నిర్వహించే దగ్గరే పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని చెప్పారు. వీరి సమాధానాలతో విసిగిన ఉద్యోగస్తులు కావాలనే అధికారులు పోస్టల్ బ్యాలెట్‌లు ఇవ్వకుండా చేశారని ఆరోపించారు. మా జాబితా లేకపోతే శిక్షణకేంద్రానికి ఎలా వస్తామని ప్రశ్నించారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌లు అందని పరిగి, కొడంగల్, తాండూరు, చేవెళ్ల, ఎల్బీనగర్, వనపర్తి, కూకట్‌పల్లి తదితర నియోజకవర్గాలనుంచి వచ్చిన 300 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్‌లు రాకపోవడంతో ఆందోళన చేపట్టారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఇవ్వకుంటే ఎన్నికల విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి అందుబాటులో లేక ఆయన వచ్చే వరకు ఆందోళన చేస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు లిస్ట్ వచ్చిందని పోస్టల్‌బ్యాటెల్‌లు ఇచ్చారని ఇది కావాలనే చేశారని ఉద్యోగులు ఆరోపించారు.



హుడాకాంప్లెక్స్: సరూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

ఎలక్షన్ కమిషన్‌పై చర్యలు తీసుకోవాలి

హుడాకాంప్లెక్స్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న తమకు పోస్టల్ బ్యాలెట్ రాకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించేందుకు 3వ విడత ట్రైనింగ్ సెషన్ హుడాకాంప్లెక్స్ జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. శిక్షణ అనంతరం ఓటు వినియోగించుకోవాలన్న ఉపాధ్యాయులు తమకు బ్యాలెట్ రాలేదని ఆందోళన చేపట్టారు. తమకు ఓటు హక్కు కల్పించకపోతే ఎన్నికల విధులు బహిష్కరిస్తామని అధికారులను హెచ్చరించారు. పోస్టల్ బ్యాలెట్ రాకపోవడంపై తమకు ప్రభుత్వంపై అనుమానం ఉందని ఉపాధ్యాయులు ఆరోపించారు. ఎలక్షన్ కమిషన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

లిస్ట్ రాకపోవడంతోనే ఆలస్యం

చేవెళ్ల అసెంబ్లీ ఎన్నికల విధులకు హాజరైన ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్‌బ్యాలెట్‌ల జాబితా అందరివీ అందలేదు. ముందుగా వచ్చిన లిస్ట్ ప్రకారం అందించాం. లిస్ట్‌లో పేర్లు రాని వారివి ఆపడంతో వారు ఆందోళన పడ్డారు. మళ్లీ ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో మాట్లాడి లిస్ట్‌ను తెప్పించుకుని అందరికీ పోస్టల్ బ్యాలెట్‌లు అందించాం.

– కృష్ణయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి

గిరిజనం.. గులాబీ వనం



మండల పరిధిలోని పలుతండాల్లో బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు ఆమెకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. - మహేశ్వరం

రాష్ట్రం ఇచ్చినట్లే.. ఆరు గ్యారెంటీలు



కేసారం గ్రామంలో మాట్లాడుతున్న తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్

- కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు
- తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్
- పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

చేవెళ్ల: తెలంగాణ రాష్ట్రం ఇచ్చినట్లే.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, తమిళనాడు ఎంపీ విష్ణుప్రసాద్ అన్నారు. శనివారం ఆయన పార్టీ చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థికి మద్దతుగా మండల పరిధిలోని గొల్లగూడ, కేసారం, దామరగిద్ద, ఖానాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని వారు పేదలకు చేసిందేమీ లేదన్నారు. దామరగిద్ద మాజీ సర్పంచ్ మధుసుధన్‌గుప్తా ఆధ్వర్యంలో భీంభరత్‌కు భారీ గజమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం భీం భరత్ మాట్లాడుతూ.. తనకు ఒక్క అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి ప్రజా సేవ చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ప్రచార కమిటీ సభ్యుడు ఎస్. వసంతం, షాబాద్ దర్శన్, సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ మధుసుధన్‌గుప్తా, పాండురంగారెడ్డి, ఎంపీటీసీ రాములు, సీపీఐ నాయకులు కె. రామస్వామి, మండలపార్టీ నాయకులు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, టేకుపల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్‌లు డీవీ ఆర్, గోనే ప్రతాప్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సమత, సరిత, శ్రీనివాస్‌గౌడ్, యాదయ్య, గోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



భీం భరత్‌ను గజమాలతో సన్మానిస్తున్న దామరగిద్ద గ్రామస్తులు